



# ఉన్నారు ఇలాంటివాళ్ళు!

కట్నేని వెంకట కృష్ణారావు

"సుధాకర్‌కు ఏక్సిడెంటయిందట పరిస్థితి చాలా సీరియస్‌గా ఉందిట" స్టాఫ్‌రూంలోకి వెళ్ళగానే హిస్టరీ లెక్చరర్ రామారావుగారు చెప్పిన మాటిది.

మౌనంగా తలూపాను నేను. సుధాకర్ మా కాలేజి స్టూడెంటు. బి.కాం. ఆఖరి సంవత్సరం చదువుతున్నాడు. ధనవంతుల బిడ్డ అతడిది. దగ్గర్లోనే ఏదో పల్లెటూరనుకుంటాను. రూం తీసుకుని ఈ వూళ్ళోనే ఉంటున్నాడు చదువు కోసమని. నా కతనితో ముఖపరిచయానికి మించిన పరిచయం లేదు కాని మా కోలెక్చరర్స్ మాటలను బట్టి నాకు తెలిసింది అతనో పెద్ద రౌడీ అని. పైకి ఎలావున్నా మా ప్రిన్సిపాల్‌కు కూడా అతనంటే భయమేనని సూచన ప్రాయంగా తెలుసు మాది కో-ఎడ్యుకేషన్ కాలేజీ కాకపోవటంవల్ల సగం వరకు 'సేవ్' అయిపోతున్నామని కొందరు లెక్చరర్లు తరచుగా జోక్ చేస్తుంటారు. నేను రామారావుగారు

చెప్పింది విని కూడా అదో సాధారణ విషయంలా తలూపి వూరుకోవటం మా వాళ్ళకు నిరుత్సాహం కలిగించినట్లుంది. "అసలు విషయం ఇంకా చెప్పలేదు మీరు" అన్నారు మరో లెక్చరర్.

నేను కుతూహలంగా రామారావుగారి వైపు చూశాను.

"ఆ సంగతికే వస్తున్నాను మహాను భావా" అని నావైపు తిరిగి "సుధాకర్‌ని హాస్పిటల్‌లో చేర్పించింది మన తెలుగు లెక్చరర్ సత్యంగారు" అన్నారాయన.

"అంతేనా. సుధాకర్‌కు ఈ యాక్సి డెంట్‌లో బాగా రక్తం పోయిందట. రక్తం ఎక్కించకపోతే బతకని పరిస్థితు లలో మన సత్యంగారే రక్తం ఇచ్చా రుట" ఇంకొకాయన మధ్యలో అందు కుంటూ చెప్పాడు.

"ఏమిటీ?" కుర్చీలో ఎగిరిపడుతూ అడిగాను నేను.

ఆ తర్వాత అందరినుంచి సేకరించిన వివరాల పూర్తి సారాంశం ఇది.

ఈవేళ తెల్లవారుజామున మెయిన్ రోడ్‌లో స్కూటర్ మీద వస్తున్న సుధాకర్‌ని ఏదో లారీ గుద్దేసి ఆగకుండా పోయిందట. లారీని ఛాయామాత్రంగా చూసినవారే కాని స్పష్టంగా గమనించిన వారెవరూ లేరు. రక్తపు మడుగులో స్పృహతప్పి పడున్న సుధాకర్‌ని పట్టించుకున్నవారూ లేరు. ఆ తర్వాత కాసేపటికి అలవాటుగా మార్నింగ్ వాక్‌కు పోయి తిరిగివస్తున్న సత్యం గారు ఆ దృశ్యం చూశారుట. వెంటనే చుట్టుపక్కలవారి సహాయంతో సుధా కర్‌ని దగ్గర్లోని హాస్పిటల్‌కు తీసుకు వెళ్ళారుట. కాని గాయాలు బాగా తగల టంతో రక్తం చాలా పోయింది. అర్జెం టుగా రక్తం ఎక్కించవలసి వచ్చింది. హాస్పిటల్‌లో సుధాకర్ గ్రూపుకు సరి పోయే రక్తం లేదు. బ్లడ్ బ్యాంక్‌లో కూడా ఆ గ్రూపు రక్తం దొరకలేదు. చివరకు రక్తం యివ్వడానికి సత్యం మాస్టారు ముందుకొచ్చి రక్తం ఇచ్చారుట.

మానవత్వం ఉన్నవాడెవడైనా ఇలాగే చేస్తాడు కాబట్టి ఇదేం వింతగా అనిపించదు. అయితే సత్యంమాస్టారి స్థానంలో మరొకరుంటే ఇలా చేస్తారా అన్నది అనుమానమే అయినా మాస్టారి స్వభావం వేరనుకోండి.

ఇంతకూ నేనిలా అనడానికీ, మా వాళ్ళు యిదో ఆశ్చర్యకరమైన వార్తగా చెప్పడానికీ ఓ కారణముంది. అది–

అచ్చితంగా సంవత్సరం క్రిందట జరిగిందా సంఘటన...

డిగ్రీ రెండో సంవత్సరం పరీక్షలు జరుగుతున్న కాలం అది. ఆ రోజు సత్యంగారు 21 వ రూములో ఇన్విజి లేటర్‌గా వెళ్ళారు. అదే రూంలో సుధా కర్ పరీక్ష వ్రాస్తున్నాడు. సుధాకర్ పరీక్ష వ్రాసే విధానం అందరికీ తెలుసు.

అతని రౌడీయిజానికి జడిసి కొందరు, వాళ్ళ నాన్న పలుకుబడికీ, డబ్బుకూ జడిసి కొందరు సుధాకర్ ఎలా వ్రాసినా చూడనట్టే ఉండేవారు.

ఆ రోజూ సుధాకర్ మామూలుగానే పాకెట్‌లోంచి కాపీలు తీసి నిర్భయంగా రాసేస్తున్నాడు. ఇన్విజిలేటర్‌గా ఉన్న సత్యంగారు ముక్కుకు సూటిగాపోయే మనిషి. నీతినిజాయితీ ఊపిరిగా బతికే మనిషి. కళ్ళ ఎదురుగా జరుగుతున్న దానిని చూస్తూ సహించలేక సుధాకర్‌కు గట్టిగా వార్నింగ్ ఇచ్చి ఆ స్లిప్‌లు లాక్కోబోయారు. నిర్లక్ష్యంగా మాస్టార్ని పక్కకు తోసి ఏమీ జరగనట్లే తన కార్యక్రమం కొనసాగించాడు సుధాకర్. పక్కనే ఉన్న మరో ఇన్విజిలేటర్ పాముతో చెలగాటం వద్దని సత్యంగార్ని హెచ్చరించాడు.

అయినా మాస్టారు తన పట్టుదల వదలలేదు. నిర్భయంగా సుధాకర్‌ని నిలుచోబెట్టి అతనిని సోదాచేసి దుస్తులలో ఉన్న స్లిప్‌లతో సహా స్వాధీనం చేసుకున్నారు. "నీకు తెలిసింది వ్రాయి. లేకపోతే ఈ పేపరు తర్వాత పూర్తి చేసుకుందువుగాని వెళ్ళిపో" అని సలహా యిచ్చారు.

సుధాకర్ నిప్పులు కురుస్తున్నట్లుగా సత్యంగారి వంక చూశాడు. "సరే చూడు నా తడాఖా" అని ఆన్సర్ బుక్ మాస్టారి ముఖాన విసిరికొట్టి బయటకు వెళ్ళిపోయాడు. సత్యంగారు చిరునవ్వు నవ్వి "కుర్రతనం" అన్నారు తేలిగ్గా తీసుకుంటూ. పక్కనున్న మరో ఇన్విజిలేటర్ మాత్రం జరగబోయేది తలుచుకొని వణికిపోయాడు.

ఈ వార్త క్షణాల్లో కాలేజీ అంతా పాకిపోయింది. ప్రిన్సిపాల్‌తో సహా అంతా ఆందోళనపడ్డారు. ఇన్విజిలేటర్ డ్యూటీ ముగిసిన తర్వాత సత్యంగారు ఏమీ జరగలేనట్లే ప్రశాంతంగా ఇంటికి బయల్దేరారు. నేనూ మరో లెక్చరరూ ఆయన్ను అనుసరించబోయాం. కాని ఆయన మమ్మల్ని వారించారు.

"వద్దు. మీరెవరూ నా వెంట రావద్దు. విద్యార్థికీ ఉపాధ్యాయుడికీ మధ్య ఎలాంటి విరోధభావానికీ తావులేదు. అతనేదో కుర్రతనపు ఆవేశంలో అలా అన్నాడని మనం కూడా అతడలా చేయగలడని భయపడితే ఎలా? అయినా ఒక ఉపాధ్యాయునిగా నా బాధ్యత నేను నిర్వర్తించాను ఆ బాధ్యత నిర్వర్తించడంలో నాకేమీ స్వార్థంలేదు అతనంటే ద్వేషమూ లేదు అతనైనా ఏదో ఆవేశంలో అలా అన్నాడే కాని ఈ పాటికి ఆలోచనకు లోనయ్యే ఉంటాడు. ఆలోచన వివేకాన్ని పెంచుతుంది."

మేం ఇంకా సంశయిస్తున్నాం అలా నిలుచుని.

"మీరు ఇంకేం ఆలోచించవద్దు. వెళ్ళిపొండి. ఇలా నేను రక్షణ కోసం

అన్నట్లుగా మిమ్మల్ని వెంటబెట్టుకు పోవడం, దురదృష్టవశాత్తు గురుశిష్యులమైన మా ఇద్దరి మధ్య ఏర్పడ్డ అతిచిన్న దూరాన్ని ఎంతో పెద్దదిచేస్తుంది. నేను ఒంటరిగా వెళ్తే, ఒకవేళ అతను నన్నేదో చెయ్యాలని ఆవేశంగా వచ్చినా, అతనిలోని లోటుపాట్లను విశదీకరించగలను. మంచి మార్గం ఇదీ అని చూపించగలను. అలాకాక మీరు నా వెంట ఉంటే అతను నా వంక రాకపోవచ్చు. కాని మా మధ్య ఏర్పడ్డ అభిప్రాయభేదం మాత్రం తొలగదు. గురుశిష్యుల మధ్య అలాంటి అగాధం ఉండకూడదంటే, నాకు భౌతికంగా కాక, మానసికంగా గాయం తగలకూడదంటే మీరిక రాకండి. మా మధ్య ఏర్పడిన అపోహలను తొలగించుకొనే అవకాశం మాకివ్వండి. అదీకాక మీరు నాకు ఈ వేళ రక్షణ ఇవ్వగలరు. రేపు రక్షణ ఇవ్వగలరు. కాని జీవితాంతమూ నా వెంట ఉండి నన్ను రక్షించలేరు కదా. ఎలాగూ జరగక తప్పదనుకున్నదేదో ఈవేళే జరగనివ్వండి."

ఇక చేసేదేంలేక మేము వెనుతిరిగాం. మా కాలేజీ ఊరి బయట ఉంటుంది సత్యంగారిల్లు కాలేజీకి దగ్గరే ప్రశాంతంగా ఉంటుందని, ఊరు మధ్య ఇల్లు అమ్మేసుకొని ఇక్కడ స్థలం కొని ఇల్లు కట్టించుకున్నారాయన. తోటలూ—తోపులూ— వీటి మధ్యనుంచి అడ్డదారి ఉంటుందా ఇంటికి. ఆ అడ్డదారిన ఇంటికి వెళతారాయన. ఆ వెళ్ళేదారి దాదాపు నిర్మానుష్యంగా ఉంటుంది. అలాంటి చోట సుధాకర్ ఆయన్ని చాలా సులభంగా ఏమైనా చేయవచ్చు. ఆయన్ని అలా ఒంటరిగా వెళ్ళనిచ్చి ఏదో తప్పుపని చేసినట్లు అనిపించసాగింది నాకు. నా పక్కనున్నాయనా అదే అభిప్రాయం వ్యక్తంచేయడంతో 'మాస్టారు ఏమన్నా అనుకోనీ' అనుకొని మళ్ళీ వెనక్కి తిరిగి ఆయన వెళ్ళిన దారిన నడక సాగించాం.

అలా అయిదు నిమిషాలు నడిచామో లేదో సుధాకర్ స్కూటర్ మీద వేగంగా మా కెదురువస్తూ కనిపించాడు. అతని షర్ట్ మీద అక్కడక్కడా ఎర్రటి మరకలున్నాయి. మావంక హేళనగా ఓ నవ్వు విసిరి మమ్మల్నిదాటి వెళ్ళిపోయాడతను. నా గుండె చప్పుడు పెరిగింది.

"వీడేదో చేసేశాడు. అనుమానం లేదు" నా పక్కనున్నాయన వొణికిపోతూ గొణిగాడు.

గుండెలు గుబగుబలాడుతుంటే గబగబా నడిచాం. మరో అయిదు నిమిషాలు గడిచీ గడవకముందే సత్యంగార్ని చేరుకున్నాం. ఒంటిమీద గాయాలతో, భుజంమీద దిగిన కత్తితో భయంకరంగా కల్పించారాయన. మమ్మల్ని చూసి బలహీనంగా ఓ నవ్వు నవ్వి పక్కకు వాలిపోయారు.

ఆ తర్వాత దడదడలాడుతున్న

గుండెలతో వణుకుతున్న అవయవాలతో ఆయన్ని హాస్పిటల్‌కు చేర్చాం. అదృష్టం కొద్దీ ఆయన బతికారు. ఆ తర్వాత జరిగిన ఆశ్చర్యకరమైన విషయమేమిటో తెలుసా! సత్యంగారు తనని కొడిచింది ఎవరో తెలియదని స్టేట్‌మెంట్ యిచ్చారు కొడిచింది సుధాకర్ తప్ప మరెవరూ కాదని మాలో ప్రతి ఒక్కరికీ తెలుసు. కాని ఆయనా మాట చెప్పనిదే ఎవరిమైనా ఏం చేయగలం. మా ప్రిన్సిపాల్‌తో సహా ప్రతి ఒక్కరం తనని కొడిచింది. సుధాకర్ అని ఒక్కమాట చెప్పమని బతిమిలాడాం. ఆయన మరి నోరు విప్పలేదు. పోలీసులూ ప్రయత్నించి విసిగిపోయి వెళ్ళిపోయారు.

కొంతమంది సత్యం మాష్టారు సుధాకర్ రౌడీజాలుంకో, వాళ్ళ నాన్న ధనబలంకో లొంగిపోయారని అన్నారు. కాని ఆయన స్వభావం తెలిసినవాళ్ళు ఎవరూ ఆ మాట నమ్మరు.

ఆ తర్వాత ఎంతో ఒత్తిడిచేశాక నాతో అన్నారాయన.

"ఆ అబ్బాయొకటీ మా అబ్బాయొకటీ కాదు కృష్ణా! నన్ను కొడిచింది అతనూ అని చెప్పి అతన్నేదో చేయించాలని ప్రయత్నించానే అనుకో అప్పుడు ఏం జరుగుతుంది. కనీసం నామీద ప్రేమతో అభిమానంతో మన ప్రిన్సిపాల్‌గారు ఎన్ని అడ్డంకులు వొచ్చినా అతన్ని డిబార్ చేస్తారు. కొన్ని సంవత్సరాల వరకూ అతన్ని పరీక్షలు వ్రాయడానికి అనర్హుడిగా చేస్తారు. అలాగే న్యాయస్థానం కూడా ఏదో శిక్ష విధిస్తుందను కుందాం. అతనేదో సాధించవలసిన ఈ వయసులో అతను కొన్ని విలువైన సంవత్సరాలను కోల్పోతాడు. ఈ మచ్చ అతని ముందు జీవితంలో కూడా తన ప్రభావం చూపిస్తుంది. ఇంత జరిగినా నాకేం ప్రయోజనం ఉంటుంది. నా విద్యార్థి భవిష్యత్తు నావల్ల పాడైతే నాకేం సంతోషముంటుంది. తెలిసీతెలియని ఈ వయసులో అర్థంలేని ఆవేశంతో కుర్రకారు చేసే పనికి మనమూ ఆవేశపడి వారిని శిక్షించటం ద్వారా వారిలో మార్పును తేలేం. మంచితనంతోనే వారి మనసును జయించాలి. వారిని మంచి మార్గం వైపు మళ్ళాలి. ఒక ఉపాధ్యాయుడిగా ప్రతి ఒక్కరినీ ఒక సానపట్టిన వజ్రంగా దేశానికి సమర్పించవలసిన బాధ్యత ఉన్న నన్ను నా చేతులతోనే ఒక ముడి వజ్రాన్ని, పొరపాటునో గ్రహపాటునో చెయ్యి కోసిందని ముక్కలు చెయ్యమంటావా."

నేనేం మాట్లాడలేకపోయాను. ఆయనే మళ్ళీ అన్నారు.

"చూడు కృష్ణా! కడుపున పుట్టిన పసిపిల్లాడు తెలిసీతెలియని తనంతో తండ్రిని కాళ్ళతో గుండెలమీద తంతాడు. అంత మాత్రాన ఆ తండ్రి కొడుకుమీద ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటాడా? ఇక్కడా

అంతే. ఇంతకూ ఎన్ని కష్టాలు, నష్టాలు విఘ్నరాలు ఎదురైనా విద్యార్థి జీవితాన్ని చక్కగా. దేశం గర్వపడేలా మలచ గలిగినవాడే అసలైన ఉపాధ్యాయుడు నా దృష్టిలో."

కాని మాస్టారు చేసిన ఈ త్యాగాన్ని ఆయన మంచితనాన్ని, ఆయన చూపిస్తున్న ఈ అభిమానాన్ని, ప్రేమను సుధాకర్ గుర్తిస్తాడా? అదే అన్నాను ఆయనతో.

"నేను చేసింది త్యాగంకాదు. అది నా బాధ్యత. అది ఎవరో గుర్తించా అంటావా. ఆ తపన నాకు లేదు. అసలు అలా అనుకోవడం సమంజసం కూడా కాదు" అన్నారాయన చిరునవ్వు నవ్వుతూ.

చివరకు నేనూహించిందే నిజమైంది. తనకు భయపడే సత్యం మాస్టారు, కొడిచింది సుధాకర్ అని చెప్పలేదని కాలర్ ఎగరేసుకు మరీ చెప్పుకోసాగాడు సుధాకర్. వినీ విన్నట్టే ఉన్నారు సత్యంగారు మేం మాత్రం అప్పటి నుండీ సుధాకర్ విషయంలో మరికాస్త జాగ్రత్తగా మసలుకుంటున్నాం. అతని డిగ్రీ ఎప్పుడు అయిపోతుందా అని రోజులు లెక్కపెట్టుకుంటూ.

ఇప్పుడీ వార్త.

సుధాకర్ని హాస్పిటల్లో చేర్పించడం, రక్తం ఇవ్వటం మానవత్వం ఉన్న ప్రతి మనిషీ చేసే పనే అయినా ఎందుకో ఏదోలా అనిపిస్తోంది నాకు. సత్యంగారి స్థానంలో నేనుంటే అలా చేసేవాణ్ణి కాదేమో అన్న భావం (కాస్త గిల్టీగా అనిపించినా) నాకు కలిగింది.

సుధాకర్ సత్యం మాస్టారి ఈ త్యాగాన్నైనా గుర్తిస్తాడా? ఈసారైనా ఆయనలోని మహావ్యక్తిని గమనిస్తాడా?

సత్యంగారు మాత్రం "నీ కిదివరకే చెప్పాను కృష్ణా! నేనుచేసింది ఒక సాటి మానవుడివల్ల బాధ్యత గల ఒక సాధారణమైన మనిషి చేసేపని మాత్రమే. రక్తం ఇవ్వటం అంటావా. అదృష్ట వశాత్తు నా రక్తం అతనికి సరిపోయింది. ఇచ్చాను. దానికి లేనిపోని గొప్పలు అంటగట్టి, ఎవరో నన్ను గుర్తించాలనీ పల్లకి ఎక్కించాలనీ అనుకోవడం ఎంత మాత్రం సమంజసం కాదు" అన్నారు నిర్వికారంగా.

చేతులెత్తి నమస్కారం చెయ్యాలని పించింది నాకు. ఇలాంటివాళ్ళు ఇంకా ఉన్నారా అనిపించింది.

ఇంతా చెప్పి హాస్పిటల్లో స్పృహ వచ్చిన తర్వాత జరిగింది తెల్సుకున్న సుధాకర్ తన మిత్రులతో మాస్టారి గురించి వెలిబుచ్చిన అమూల్య అభిప్రాయం చెప్పకపోతే ఎలా?

"సత్యం మాస్టారు నన్ను కాకాపట్టాలని చూస్తున్నారు. అందుకే ఇలా చేశాడు."

విన్నారుగా. అప్పుడనిపించింది నాకు 'ఉన్నారు ఇలాంటివాళ్ళు' అని.